ఒకే కాన్పులో ఆరుగురు

- జన్మనిచ్చిన పాక్ మహిళ
- అత్యంత అరుదైన ఘటన

ఇస్లామాబాద్: పాకిస్థానీ మహిళ జీనత్ వహీద్ (27) గంట వ్యవధిలో ఆరుగురు బిడ్డలకు జన్మనిచ్చారు. వీరిలో నలుగురు బాలురు, ఇద్దరు బాలికలు ఉన్నారు. రావల్పిండిలోని ఓ దవాఖానలో ఈ నెల 19న ఆమె ప్రసవించారు. ఆమెకు నొప్పులు రావడంతో ఈ నెల 18న దవాఖానలో చేర్పించారు. తల్లీబిడ్డలు ఎటువంటి సమస్యలు లేకుండా చాలా ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. ఒకేసారి ఆరుగురు బిడ్డలు జన్మించడంతో ఈ దవాఖాన సిబ్బంది చాలా సంతోషం వ్యక్తం చేశారు. వీరికి అవసరమైన వైద్య సంరక్షణ, సదుపాయాలను అందించినట్లు తెలిపారు. వైద్యులు మాట్లాడుతూ, ఇది అత్యంత అరుదైన సంఘటన అని, దాదాపు 45 లక్షల మంది గర్భిణులలో ఒకరికి మాత్రమే ఈ విధంగా బిడ్డలు జన్మిస్తారని చెప్పారు.

గాడిద పాలతో నెలకు 3 లక్షలు

గుజరాత్ యువకుడి సంపాదన

అహ్మదాబాద్, ఏప్రిల్ 21: 'చదువు రాకపోతే గాడిదలు కాయ్.. కనీసం అవి బరువులైనా మోస్తయ్. నువ్వు ఉన్నావ్ ఎందుకు?' అంటూ గాడిదతో పోల్చుతూ తిడుతుంటారు. కానీ, ఆ గాడిదలతోనే నెలకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు సంపాదిస్తున్నాడు గుజరాత్‌కు చెందిన ధీరేణ్ సోలంకీ. వివరాల్లోకెళితే.. ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నించి విఫలమైన ధీరేణ్.. ప్రైవేట్ కంపెనీల్లో పనిచేసినా పెద్దగా లాభం లేకపోయింది. ఏదైనా బిజినెస్ పెడదామని ఆలోచించగా, దక్షిణ భారతదేశంలో గాడిదల పెంపకానికి ఆదరణ పెరుగుతున్నదని తెలుసుకున్నాడు. సమాచారం సేకరించి.. ఆర్నెళ్ల కిందట 20 గాడిదలను కొని సొంత ఊరిలోనే ఫామ్ ప్రారంభించాడు. దానికోసం రూ.22 లక్షలు పెట్టుబడి అయ్యింది. ప్రస్తుతం అతడి వద్ద 42 గాడిదలు ఉన్నాయి. ఆ గాడిదలు ఇచ్చే పాలను దక్షిణ భారత్‌లోని వినియోగదారులకు సరఫరా చేస్తున్నాడు. 'ఫామ్ పెట్టిన ప్రారంభంలో గిరాకీ లేదు. దక్షిణ భారత్‌లో డిమాండ్ ఉన్నదని తెలుసుకొని అక్కడి కస్టమర్లను సంప్రదించా. కర్ణాటక, కేరళకు పాలను సరఫరా చేస్తున్నా. సౌందర్య ఉత్పత్తుల కంపెనీలు నా వద్ద పాలను కొంటున్నాయి. ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకొని విక్రయిస్తున్నా. ప్రభుత్వం ఈ రంగంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది' అని వివరించాడు. ఒక లీటరుకు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు ధర ఉన్నదని వెల్లడించాడు.

గాడిద పాలతో లాభాలు:

కోరింత దగ్గు, ఆస్తమా, వైరల్ జ్వరాలు, ఇన్ఫెక్షన్లు తగ్గేందుకు గాడిద పాలను ఔషధంగా వాడుతారు. ఈ పాలను ఫెయిర్‌నెస్ క్రీములు, షాంపూలు, లిప్ బామ్, బాడీ వాష్‌ల తయారీలో వాడతారు.

కేరళలో బర్డ్ ఫ్లూ కలకలం

అలప్పుజాలో 21 వేల బాతుల హననం

తిరువనంతపురం: 'బర్డ్ ఫ్లూ' వైరస్ వ్యాప్తి కేరళలో కలకలం రేపుతున్నది. అలప్పుజా జిల్లాలోని రెండు గ్రామాల్లో వైరస్ సోకినట్టు అధికారులు గుర్తించారు. ఇడతవా గ్రామంలోని వార్డ్-1, చిరుతానా గ్రామంలోని వార్డ్-3లోని బాతుల నుంచి సేకరించిన నమూనాలు భోపాల్ ల్యాబ్‌కు పంపగా, వాటికి 'బర్డ్ ఫ్లూ' (హెచ్5ఎన్1) వైరస్ సోకినట్టు నిర్ధారణ అయ్యింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వైరస్ వ్యాప్తికి కేంద్రంగా ఉన్న ఆ రెండు గ్రామాల్లోని 21 వేల బాతులను, కిలోమీటర్ పరిధిలోని పక్షుల్ని అధికారులు చంపేయనున్నట్టు వార్తలు వెలువడ్డాయి.

సరిపడా నిద్రలేకపోతే షుగర్ ముప్పు

- 6 గంటల కంటే తక్కువ నిద్రిస్తున్న వారికి రిస్క్
- బ్రిటన్ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి

లండన్, ఏప్రిల్ 21: సరిపడా నిద్రపోని వారిలో మధుమేహ వ్యాధి ముప్పు పెరుగుతున్నదని బ్రిటన్‌కు చెందిన పరిశోధకులు గుర్తించారు. యూకే బయోబ్యాంక్‌లోని 2.5 లక్షల మంది డాటాను అధ్యయనం చేసిన తర్వాత షుగర్ వ్యాధికి, నిద్రకు సంబంధం ఉందని పరిశోధకులు తేల్చారు. ఆరోగ్యకరమైన ఆహారం, జీవనశైలి మధుమేహ ముప్పును దూరం చేస్తుందని, ఇదే సమయంలో సరిపడా నిద్ర పోవడం కూడా ముఖ్యమేనని పేర్కొన్నారు. సాధారణంగా ఒక మనిషి రోజుకు 7 - 8 గంటలు నిద్రపోవాలని, ఆరు గంటల కంటే తక్కువ సమయం నిద్రపోతున్న వారిలో షుగర్ వ్యాధి ముప్పు పెరుగుతున్నట్టు గుర్తించారు. రోజుకు 7 - 8 గంటలు నిద్రపోతున్న వారితో పోలిస్తే ఐదు గంటల పాటు నిద్రపోతున్న వారిలో మధుమేహం బారిన పడే ముప్పు 16 శాతం ఎక్కువని, రోజుకు మూడు నుంచి నాలుగు గంటలు నిద్రపోతున్న వారిలో 41 శాతం ఎక్కువని పరిశోధకులు తేల్చారు. కచ్చితంగా రోజుకు 7 - 8 గంటల పాటు మంచి నిద్ర ఉండేలా చూసుకోవాలని సూచించారు.

'హర్ముజ్'ని దిగ్బంధిస్తే పెట్రో ధరలు పైపైకి!

ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలే కారణం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: ముడి చమురు రవాణాకు కీలకమైన హర్ముజ్ జల సంధిని ఇరాన్ దిగ్బంధిస్తే పెట్రోలు, ద్రవీకృత సహజ వాయువుల ధరలు పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడ్డాయి. ఇదే జరిగితే భారత్‌కు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని తెలిపాయి. ఇరాన్-ఇజ్రాయెల్ పరస్పర దాడుల నేపథ్యంలో బ్యారెల్ చమురు ధర 90 అమెరికన్ డాలర్లు పలుకుతున్నదని వారు వెల్లడించారు. ఈ సంక్షోభాన్ని నియంత్రించాలంటే ప్రభుత్వాలు పెట్రో ధరలు తగ్గించాలని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచించింది. ఒకవేళ సరఫరా సంక్షోభం ముదిరితే రష్యా నుంచి పెట్రో దిగుమతులను భారత్ పెంచుకోవాలని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ సూచించింది.

కుంగుతున్న చైనా నగరాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: చైనాలోని ప్రధాన నగరాలు నానాటికీ కుంగుతున్నాయని, దీని వలన చైనా నగర జనాభాలోని మూడింట ఒక వంతు మంది ప్రమాదంలో ఉన్నారని తాజా అధ్యయనం పేర్కొన్నది. సముద్రపు మట్టం కంటే కిందకు ఉండే అర్బన్ ఏరియా 2120 సంవత్సరం నాటికి మూడింతలు అవుతుందని, దీని వలన 5.5 నుంచి 12.8 కోట్ల మందిపై ప్రభావం పడే చాన్స్ ఉన్నదని పరిశోధకులు గుర్తించారు. బీజింగ్, షాంఘై సహా 82 నగరాలకు చెందిన శాటిలైట్ డాటా ఆధారంగా శాస్త్రవేత్తలు అధ్యయనం చేశారు.

క్రీడలు చూసేవారిలో మానసిక ఆరోగ్యం

జపాన్ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి

టోక్యో, ఏప్రిల్ 21: క్రీడలు చూడటం వల్ల వినోదం పొందడంతో పాటు ఆరోగ్య ప్రయోజనాలూ ఉన్నాయంటున్నారు జపాన్‌కు చెందిన పరిశోధకులు. క్రీడలు చూసే వారు మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని వీరు ఒక అధ్యయనం ద్వారా గుర్తించారు. టోక్యోలోని వసేడా యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు.. మానసిక ఆరోగ్యంపై క్రీడలు ఎలాంటి ప్రభావం చూపిస్తున్నాయనేది కనుగొనేందుకు ఒక అధ్యయనం చేశారు. ఈ అధ్యయనం మూడు భాగాలుగా జరిగింది. మొదట 20 వేల మంది జపాన్ ప్రజలపై అధ్యయనం జరిపారు. తర్వాత 208 మంది క్రీడలు చూసే ముందు, చూసిన తర్వాత వారి మెదళ్లలో వచ్చిన మార్పులను పరిశీలించారు. చివరగా, క్రీడలు చూస్తున్నప్పుడు మెదడు పనితీరులో వచ్చిన మార్పులను పరిశోధకులు న్యూరోఇమేజింగ్ పద్ధతుల ద్వారా గుర్తించారు. క్రీడలు ఎక్కువగా చూసే వారి మెదడులో గ్రే మ్యాటర్ ఎక్కువగా ఉంటుందని, మెదడు పనితీరు చురుగ్గా ఉంటుందని, మానసికంగా ఆరోగ్యంగా ఉంటున్నారని ఈ అధ్యయనం ద్వారా పరిశోధకులు తేల్చారు.

ఏ వయసు వారికైనా ఆరోగ్య బీమా

- 65 ఏండ్ల వయో పరిమితి తొలగించిన ఐఆర్‌డీఏఐ
- వాయిదా పద్ధతిలో ప్రీమియం చెల్లించే వెసులుబాటు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: కొత్తగా ఆరోగ్య బీమా తీసుకునేందుకు ఉన్న 65 ఏండ్ల వయో పరిమితిని ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐఆర్‌డీఏఐ) తొలగించింది. ఇక నుంచి ఏ వయసు వారైనా హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని తీసుకోవచ్చని స్పష్టం చేసింది. ఇంతకాలం 65 ఏండ్ల దాటిన వారు హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకునేందుకు వీలుండేది కాదు. ఈ నిబంధనను తొలగిస్తూ ఇటీవల ఐఆర్‌డీఏఐ గెజిట్ విడుదల చేసింది. ఏప్రిల్ 1 నుంచి ఏ వయసు వారైనా హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవచ్చని పేర్కొన్నది. పిల్లలు, విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు, ఇలా అన్ని వయసుల వారికి, గర్భిణుల కోసం ప్రత్యేక హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలను అందించాలని ఇన్సూరెన్స్ కంపెనీలను ఐఆర్‌డీఏఐ ఆదేశించింది.

అనారోగ్య సమస్యలున్నా..

ముందే ఏమైనా అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు ఇవ్వాలని సైతం ఐఆర్‌డీఏఐ స్పష్టం చేసింది. ఇంతకాలం క్యాన్సర్, ఎయిడ్స్, గుండెజబ్బులు వంటి సమస్యలు ఉన్న వారికి కంపెనీలు హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు ఇచ్చేవి కావు. కాగా, ఇన్సూరెన్స్ ప్రీమియం మొత్తాన్ని వాయిదాల పద్ధతిలో చెల్లించే అవకాశం కూడా పాలసీదారులకు ఇవ్వాలని ఐఆర్‌డీఏఐ ఆదేశించింది. ఆయుర్వేద, యోగా, నాచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతి చికిత్సకు కవరేజీలో ఎలాంటి పరిమితి విధించవద్దని, ఇన్సూరెన్స్ చేయించుకున్న మొత్తానికి కవరేజీ ఈ చికిత్సలకు కూడా ఇవ్వాలని స్పష్టం చేసింది.

'ఇండియన్ చార్లెస్ శోభరాజ్'

ధనిరామ్ మిట్టల్ మృతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: దొంగతనాలు, మోసాలు, ఆర్థిక నేరాలకు పాల్పడుతూ 'ఇండియన్ చార్లెస్ శోభరాజ్'గా ముద్రపడిన ధనిరామ్ మిట్టల్ (85) గుండెపోటుతో శనివారం మృతిచెందాడు. గత ఏడాదిగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న అతడి మరణవార్తను మిట్టల్ కుమారుడు వెల్లడించాడు. న్యాయ విద్యను అభ్యసించిన ధనిరామ్ మిట్టల్ 1000కిపైగా కార్లను దొంగలించాడు. వందలసార్లు అరెస్టయ్యాడు. ఫోర్జరీ పత్రాలతో జడ్జిగా అవతారమెత్తి.. రెండు నెలలు కోర్టులో తీర్పులు చెప్పటం, 2000 మందికిపైగా నేరస్థులను జైలు నుంచి విడుదల చేయటం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. దీనికంటే ముందు ఫోర్జరీ పత్రాలను సృష్టించి, 1968 నుంచి 1974 వరకు రైల్వే స్టేషన్ మాస్టర్‌గా కూడా పనిచేశాడు.

చెట్లను కౌగిలించుకునేందుకు రూ.1500!

- బెంగళూరులో ఓ కంపెనీ కార్యక్రమం
- మానసిక ఒత్తిడి తగ్గించుకునేందుకట

బెంగళూరు, ఏప్రిల్ 21: బెంగళూరుకు చెందిన ఒక కంపెనీ ప్రకటన ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ట్రోవ్ ఎక్స్‌పీరియెన్సెస్ అనే కంపెనీ ఏప్రిల్ 28న 'ఫారెస్ట్ బాతింగ్' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు ఒక ప్రకటన ఇచ్చింది. ఇందులో చెట్లను కౌగిలించుకోవడం, అడవిలో నడవడం వంటివి ఉంటాయని, మానసిక ఒత్తిడిని దూరం చేసుకునేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని ఈ కంపెనీ పేర్కొన్నది. బెంగళూరు హైకోర్టు పక్కనే ఉన్న కబ్బన్ పార్క్‌లో జరగనున్న ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు ఒక్కొక్కరు రూ.1,500 చెల్లించాలని ప్రకటించింది. ఈ ప్రకటన చూసిన నెటిజన్లు సోషల్ మీడియాలో రకరకాలుగా స్పందిస్తున్నారు. 'మార్కెట్‌లోకి కొత్త స్కామ్ వచ్చింది.. చెట్లను కౌగిలించుకునేందుకు రూ.1,500 ఏంటి?' అంటూ కొందరు నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.

ముయిజ్జు పార్టీదే విజయం

మాల్దీవులు పార్లమెంట్‌లో 66 స్థానాలు కైవసం

మాలే: చైనా అనుకూల వైఖరి అనుసరిస్తున్న మాల్దీవులు అధ్యక్షుడు ముయిజ్జుకు ఆ దేశ ఓటర్ల నుంచి మద్దతు లభించింది. ఆయన నాయకత్వం వహిస్తున్న 'పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్' (పీఎన్‌సీ) మాల్దీవులు పార్లమెంట్ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. 93 స్థానాలున్న మాల్దీవులు పార్లమెంట్ (మజ్లిస్)కు ఆదివారం ఎన్నికలు జరగ్గా, 86 స్థానాల్లో ఫలితాలు ప్రకటించారు. ఇందులో 66 స్థానాల్ని పీఎన్‌సీ కైవసం చేసుకుంది. మరో 7 స్థానాల్లో ఫలితాలు వెలువడ్డాక.. పీఎన్‌సీ మెజార్టీ మరింత పెరిగే అవకాశముంది. ప్రధాన ప్రతిపక్షం 'ఎండీపీ' కేవలం 12 స్థానాలకు పరిమితమైంది. దీంతో చైనాతో ఆర్థిక సంబంధాల్ని పెంచుకోవటం, భారీ ప్రాజెక్టులను చైనాకు అప్పగించటం, వివాదాస్పద స్థలంలో వేలాది భవన నిర్మాణాలు.. మొదలైన వాటిపై ముయిజ్జు ప్రభుత్వానికి పార్లమెంట్‌లో అనుకూల పరిస్థితి ఏర్పడింది.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

కొత్తగూడెం క్రైం, ఏప్రిల్ 21: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఆదివారం జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతిచెందాడు. అతడిని మావోయిస్టు జనతా సర్కార్ అధ్యక్షుడు గుడ్డీ కవాసి (34)గా పోలీసులు గుర్తించారు. అతడిపై రూ.లక్ష రివార్డు ఉన్నట్టు వెల్లడించారు. బీజాపూర్ ఎస్పీ జితేంద్రయాదవ్ తెలిపిన వివరాల ప్రకారం, బైరామ్‌గఢ్ బ్లాక్‌లోని కేశ్‌కుతుల్-కేశముండా అడవుల్లో భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఇరువర్గాల మధ్య సుమారు 20 నిమిషాలపాటు కాల్పులు కొనసాగాయి. కాల్పులు ముగిసిన తర్వాత భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చేపట్టాయి. ఘటనా స్థలం నుంచి ఓ మావోయిస్టు మృతదేహంతోపాటు పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నాయి.

సివిల్స్ ర్యాంకర్లకు మహేశ్‌భగవత్ అభినందన

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): సివిల్స్ ఫలితాల్లో ర్యాంకులు సాధించిన తెలంగాణకు చెందిన దోనూరి అనన్యరెడ్డి, ఏపీకి చెందిన ఉదయ్‌కృష్ణారెడ్డిని రైల్వే అండ్ రోడ్ సేఫ్టీ ఏడీజీ మహేశ్‌భగవత్ అభినందించారు. ఇంటర్వ్యూ కోసం వీరు మహేశ్‌భగవత్ వద్ద శిక్షణ తీసుకున్నారు. అనన్యరెడ్డికి 3వ ర్యాంకు, ఉదయ్‌కృష్ణారెడ్డికి 780వ ర్యాంకు రావడంతో మహేశ్‌భగవత్ ఇంటికి వచ్చి ఆశీర్వాదం తీసుకున్నారు.

టెట్ దరఖాస్తులు 2.86 లక్షలే..

ఆసక్తి చూపని అభ్యర్థులు.. భారీగా తగ్గిన అప్లికేషన్లు

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్‌కు ఈ సారి దరఖాస్తులు భారీగా తగ్గాయి. శనివారం రాత్రితో గడువు ముగియగా, 2.86,386 మంది మాత్రమే అప్లయ్ చేసుకున్నారు. ఇందులో పేపర్ 1కోసం 99,958, పేపర్ 2కు 1,86,428 మంది దరఖాస్తు చేసుకున్నారు. 2023లో 4.77 లక్షలు, 2022లో 6.28 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటితో పోల్చితే ఈ ఏడాది భారీగా తగ్గాయి. ఉద్యోగోన్నతులకు టెట్ తప్పనిసరి కావడంతో, ఈ ఏడాది కొత్తగా సర్వీస్ టీచర్లు కూడా హాజరవుతుండడంతో, దరఖాస్తుల సంఖ్య పెరగాల్సి ఉండగా, అలా జరగలేదు. టెట్ ఫీజును రూ. 400 నుంచి ఒక పేపర్‌కు రూ. వెయ్యి, రెండు పేపర్లకు రూ. 2వేలకు పెంచడంతో నిరుద్యోగులు ముందుకు రాలేదు. మే 15న టెట్ హాల్‌టికెట్లు విడుదల చేస్తారు. మే 20 నుంచి జూన్ 3 వరకు పరీక్షలను నిర్వహించి, జూన్ 12న ఫలితాలు విడుదల చేస్తారు.

టెట్ పేపర్-2 దరఖాస్తుల్లో నల్లగొండ జిల్లా టాప్

టెట్ పేపర్-1లో ఆదిలాబాద్ టాప్

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): టెట్ దరఖాస్తుల్లో పేపర్-2లో 1,86,428 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. అధికంగా నల్లగొండ జిల్లా నుంచి 9,162, తక్కువగా ములుగు నుంచి 1,888 దరఖాస్తులు వచ్చినట్టు పేర్కొన్నారు. సబ్జెక్టుల వారీగా.. గణితం, సైన్స్‌లో 99,974మంది దరఖాస్తు చేసుకోగా, నల్లగొండలో ఎక్కువగా 7163 మంది, తక్కువగా భూపాలపల్లిలో 935 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. సోషల్ స్టడీస్‌లో 86,454 మంది దరఖాస్తు చేసుకోగా, ఎక్కువగా జనగాం జిల్లాలో 5942 మంది, తక్కువగా మెదక్ జిల్లాలో 686 మంది దరఖాస్తు చేసుకున్నారు. టెట్ పేపర్-1 కోసం మొత్తం 99,958 దరఖాస్తులు రాగా, అందులో ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎక్కువగా 7,504 మంది, తక్కువగా జయశంకర్ భూపాలపల్లి నుంచి 771 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకొన్నట్టు టెట్ అధికారులు తెలిపారు.

నాలుగేండ్ల డిగ్రీ విద్యార్థులకూ పీహెచ్‌డీ చాన్స్

ఢిల్లీ, ఏప్రిల్ 21: నాలుగేండ్ల అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ కోర్సు చేసిన విద్యార్థులు కూడా నెట్ (నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్)కు అర్హత సాధించి నేరుగా పీహెచ్‌డీని చేయవచ్చని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ జగదీశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ లేదా పీహెచ్‌డీ అభ్యసించడానికి అభ్యర్థులు తమ నాలుగేండ్ల డిగ్రీలో కనీసం 75 శాతం మార్కులు లేదా సమానమైన గ్రేడ్ అవసరమని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ (నాన్ క్రీమీలేయర్), దివ్యాంగులు, ఈబీసీ అభ్యర్థులకు 5 శాతం మార్కులు లేదా సమాన గ్రేడ్ సడలింపుతో అనుమతి ఉంటుందని పేర్కొన్నారు.

పరీక్షలు జరిపారు.. మార్కులు మరిచారు!

- 1-9 తరగతుల విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులపై నిర్లక్ష్యం
- రేపటితో ముగియనున్న విద్యా సంవత్సరం
- మార్కులు అప్‌లోడ్ చేస్తేనే గడువులోగా ఇచ్చే అవకాశం

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఒకటి నుంచి 9వ తరగతి వరకు గల విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డులు ఇస్తారా? ఇవ్వరా? అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. ఒకవేళ ఇవ్వాలనుకుంటే గడువులోగా ఇవ్వడం కష్టంగానే కనిపిస్తున్నది. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి వారు సాధించిన మార్కులను ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయకపోవడమే ఇందుకు కారణం. దీనిని సీరియస్‌గా తీసుకున్న విద్యాశాఖ.. విద్యా సంవత్సరం త్వరలో ముగుస్తుందని, ఈ ప్రక్రియను సత్వరమే పూర్తిచేయాలని ఆదేశాలు ఇచ్చింది. నిరుడు రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు ప్రభుత్వం 40 వేలకు పైగా ట్యాబ్‌లను పంపిణీ చేసినా మార్కుల ఎంట్రీ జరగకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థులకు నాలుగు ఫార్మేటివ్ అసెస్‌మెంట్, ఒక సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను నిర్వహించారు. రెండో సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు ప్రస్తుతం జరుగుతున్నాయి. ఈ నెల 23న విద్యా సంవత్సరం చివరి పనిదినం కావడంతో అదేరోజు విద్యార్థులందరికీ ఆన్‌లైన్ ప్రోగ్రెస్ రిపోర్టులు ఇవ్వాల్సి ఉన్నది.

విద్యార్థుల మార్కులను schooledu. telangana. gov.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తే ఆటోమెటిక్‌గా ఆన్‌లైన్ ప్రోగ్రెస్ రిపోర్టులు జనరేట్ అవుతాయి. వీటిని డౌన్‌లోడ్ చేసి ఈ నెల 23న విద్యార్థులకు అందజేయాల్సి ఉన్నది. కానీ ఆన్‌లైన్‌లో మార్కుల ఎంట్రీ జరగనేలేదు. దీంతో ఆన్‌లైన్ ప్రోగ్రెస్ రిపోర్ట్‌లు ఇచ్చే పరిస్థితులు కనిపించడం లేదు.

ఆగమేఘాలపై ఆదేశాలు

పలు పాఠశాలల్లోని విద్యార్థుల మార్కుల ఎంట్రీ ఇప్పటివరకు జరగకపోవడంపై విద్యాశాఖ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయంపై సమగ్రశిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ పలు జిల్లాల డీఈవోలపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేశారు. ఈ నెల 23లోపు మార్కులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని ఆదేశించారు. ఈ అంశంపై డీఈవోలు, ఎంఈవోలు, నోడల్ అధికారులు, ప్రధానోపాధ్యాయులు ఎప్పటికప్పుడు మార్కుల ఎంట్రీని పర్యవేక్షించాలని సూచించారు. ఇప్పటివరకు వెబ్‌సైట్‌లో మార్కులను అప్‌లోడ్ చేయని వారంతా పూర్తిచేసి, ఈ నెల 23న విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు ఇవ్వాలని ఆదేశాలిచ్చారు.

బస్సు బోల్తా.. పది మంది జవాన్లకు గాయాలు

- ముగ్గురి పరిస్థితి విషమం

కొత్తగూడెం క్రైం, ఏప్రిల్ 21: జవాన్లు ఎన్నికల విధులు ముగించుకొని తిరిగి వస్తుండగా, వారు ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదవశాత్తు బోల్తాపడి పది మందికి గాయాలైన ఘటన ఆదివారం జగదల్‌పూర్‌లో జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. ఛత్తీస్‌గఢ్‌లో లోక్‌సభ ఎన్నికల తొలిదశ పోలింగ్ ముగిసింది. దీంతో జగదల్‌పూర్ నుంచి భద్రతాదళాలు ప్రత్యేక బస్సులో హెడ్‌క్వార్టర్స్‌కు తిరిగి వస్తుండగా, కోడ్నార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దిల్మిలి వద్ద బస్సుకు ఎద్దు అడ్డు వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పదిమందికి గాయాలవగా, అందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నది. ఆ సమయంలో బస్సులో 30 మంది సైనికులు ఉన్నారు. క్షతగాత్రులను జగదల్‌పూర్‌లోని డిమ్రపాల్ మెడికల్ కాలేజీ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నట్టు బస్తర్ ఎస్పీ శలభ్ కుమార్‌సిన్హా ధ్రువీకరించారు.

బీఆర్‌ఎస్ కార్యకర్త దారుణ హత్య

- శ్రీనునాయక్‌ను కొట్టి చంపిన తొమ్మిది మందిపై కేసు
- సంగారెడ్డి జిల్లా సింగార్‌బొగుడ తండాలో ఘటన
- దాడి చేసింది కాంగ్రెస్ గూండాలే..
- రాజకీయ కక్షతోనే ప్రాణం తీశారు: మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, ఏప్రిల్ 21: సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం సింగార్‌బొగుడ తండాకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త శ్రీనునాయక్ (22) దారుణహత్యకు గురయ్యాడు. తండాలో సీసీరోడ్డు పనుల విషయంలో తలెత్తిన వివాదం పెద్దది కావడంతో శనివారం శ్రీనునాయక్‌ను పలువురు పంచాయితీ పేరుతో పిలిచి రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడటంతో తీవ్ర గాయాలపాలైన శ్రీనునాయక్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో అతడిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే శ్రీనునాయక్ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. శ్రీనునాయక్ హత్య ముమ్మాటికీ రాజకీయ కక్షతోనే జరిగిందని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా వ్యవహరించాడనే అక్కసుతోనే కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా కాంగ్రెస్ నాయకులు ఇష్టారీతిన అభివృద్ధి పనులు చేపడుతుండటంతో ఈ వివాదం తలెత్తిందన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు.

బడులకు రేపే ఆఖిరు

- 24 నుంచి వేసవి సెలవులు.. తిరిగి జూన్ 12న రీ ఓపెన్

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): బడిపిల్లలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వేసవి సెలవులు రానే వచ్చేశాయి. ఒక్కరోజు బడికెళితే చాలు 49 రోజులు సెలవులే. 2024 -25 విద్యాసంవత్సరం ముగింపు దశకు చేరింది. మంగళవారమే బడులకు ఆఖరి పనిదినం. సోమవారంతో సమ్మేటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు ముగియనున్నా యి. మంగళవారం బడుల్లో పేరెంట్ టీచర్ సమావేశాలు నిర్వహించి, ఆన్‌లైన్ ప్రోగ్రెస్‌కార్డులు ఇస్తారు. ఇక బుధవారం నుంచి జూన్ 11 వరకు బడులకు వేసవి సెలవులు ఇవ్వనున్నారు. జూన్ 12న బడులు తిరిగి తెరుచుకుంటాయి.

ఈ విద్యా సంవత్సరంలో అల్పాహారానికి శ్రీకారం

రాష్ట్రంలోని సర్కారు బడుల్లోని విద్యార్థుల ఆకలి తీర్చే 'సీఎం బ్రేక్‌ఫాస్ట్' పథకానికి గత కేసీఆర్ సర్కారు ఈ విద్యాసంవత్సరంలోనే శ్రీకారం చుట్టింది. దాదాపు 27,147 పాఠశాలల్లోని 23 లక్షల విద్యార్థులకు లబ్ధి చేకూర్చేలా ఈ పథకానికి అంకురార్పణ చేసింది. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నది. దశల వారీగా రాష్ట్రంలోని 3,500 స్కూళ్లల్లో ఈ పథకాన్ని విస్తరించారు. ఈ పథకం అమలుతో బడుల్లో హాజరు శాతం గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ పథకాన్ని ప్రస్తుతం రేవంత్‌రెడ్డి సర్కారు అటకెక్కించింది.

మౌలిక వసతుల కల్పనపై ఫోకస్

ఈ వేసవి సెలవుల్లో రాష్ట్రంలోని బడుల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని విద్యాశాఖ లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందుకోసం రూ. 1100కోట్ల నిధులను ఖర్చు చేస్తున్నది. పనులను పూర్తి చేసి, జూన్ 5 కల్లా బడులను సిద్ధం చేయాలని గడువు విధించింది.

మే 12 వరకు నెట్ దరఖాస్తు గడువు

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): మే నెల 12 వరకు యూజీసీ నెట్-2024 పరీక్ష దరఖాస్తుల గడువు ఉన్నది. ఈ నెల 20 నుంచే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాగా, జూన్ 16న పరీక్ష ఉంటుంది. దరఖాస్తు ఫీజుగా జనరల్ అభ్యర్థులు రూ.1,150, ఈడబ్ల్యూఎస్/ఓబీసీ (నాన్-క్రీమీలేయర్) అభ్యర్థులు రూ.600, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్స్ రూ.325 చెల్లించాల్సి ఉంటుంది. ఈ పరీక్ష హిందీ, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహిస్తారు. మొదటి షిఫ్టులో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో షిఫ్టు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. దేశంలోని యూనివర్సిటీలలో లెక్చరర్‌షిప్ (అసిస్టెంట్ ప్రొఫెసర్), జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ కోసం ఏడాదిలో డిసెంబర్, జూన్ నెలల్లో ఈ పరీక్ష నిర్వహిస్తారు.

10 రైళ్ల రాకపోకలు రద్దు

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలో వివిధ స్టేషన్ల మధ్య 10 రైళ్ల రాకపోకలను రద్దు చేసినట్టు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి మే 26 వరకు భద్రాచలం రోడ్-విజయవాడ, సికింద్రాబాద్-వరంగల్, వరంగల్-హైదరాబాద్, కాజీపేట్-బల్హార్ష, కాజీపేట్-డోర్నకల్, విజయవాడ-డోర్నకల్ స్టేషన్ల మధ్య రైళ్లను రద్దు చేసినట్టు పేర్కొన్నారు. 4 స్టేషన్ల నడుమ నాలుగు రైళ్లను ఈ నెల 22 నుంచి మే 4 వరకు పాక్షికంగా రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు.

టీఎస్‌ఆర్జేసీ సెట్ పరీక్షకు 84 శాతం హాజరు

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని కాలేజీల్లో ఇంటర్ ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన ఎంట్రెన్స్ ఎగ్జామ్ సజావుగా ముగిసింది. ఉమ్మడి జిల్లాకేంద్రాల్లోని 309 సెంటర్లలో నిర్వహించిన పరీక్షకు 84శాతం విద్యార్థులు హాజరైనట్టు సెక్రటరీ రమణకుమార్ తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు 73,528 విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 61,442 మంది హాజరైనట్టు పేర్కొన్నారు. ఫలితాలు మే రెండోవారంలో విడుదల చేయనున్నట్టు తెలిపారు.

24 నుంచి ఆటో డ్రైవర్ల నిరసనలు

- ఆటో యూనియన్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్

మంథని, ఏప్రిల్ 21: ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24 నుంచి 28 వరకు తహసీల్దార్లు, కలెక్టర్లు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేస్తామని ఆటో యూనియన్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, అధికార ప్రతినిధి దార మధు వెల్లడించారు. ఈ మేరకు పెద్దపల్లి జిల్లా మంథనిలోని ఆటో డ్రైవర్లతో ఆదివారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పేరుతో ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లకు ఉపాధి కరువైందని తెలిపారు. దీంతో ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24న తహసీల్దార్లకు, 26న కలెక్టర్లకు, 28న ఎమ్మెల్యేలకు వినతి పత్రాలను సమర్పిస్తామని చెప్పారు. ఈ నెల 30 నుంచి రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల స్థాయి సదస్సులను, మే 9న మహబూబాబాద్‌లో రాష్ట్ర స్థాయి బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు నరసయ్య, యాసిన్, రమేశ్, ప్రసాద్, నవీన్, కట్ల సతీశ్, రాజు, తోటపల్లి సంతోష్, తుంగల శ్రీనివాస్, విష్ణు, సలీం, ఖదీర్, బుక్క శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమెరికాలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

హుజూరాబాద్‌టౌన్/స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 21: అమెరికాలోని అరిజోనా రాష్ట్రం ఫినిక్స్ ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన డాక్టర్ నవీన్, స్వాతి దంపతుల పెద్ద కుమారుడైన ముక్క నివేశ్ (20), జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లికి చెందిన కమల్‌కుమార్ గుప్తా, పద్మ దంపతుల కుమారుడైన గౌతంకుమార్(20) అరిజోనా స్టేట్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ (సీఎస్) సెకండియర్ చ దువుతున్నారు. శనివారం ఉదయం వీరిద్దరితోపాటు కళాశాలకు చెందిన మరో ఇద్దరు స్నేహితులు కలిసి వాటర్ ఫాల్స్ చూసేందుకు వెళ్లారు. తిరిగి వస్తుండగా రాత్రి 11.30 గంటల (అమెరికా కాలమానం ప్రకారం)కు వెనుక నుంచి వచ్చిన కారు వీరు ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టింది. దీంతో వెనుక సీట్లో కూర్చొన్న నివేశ్, గౌతంకుమార్ మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. మరో ఇద్దరు గాయాలతో బయటపడ్డారన్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్ నివేశ్ కుటుంబసభ్యులను పరామర్శించారు.

గౌతంకుమార్ (ఫైల్), ముక్కా నివేశ్ (ఫైల్)